
ABN ఆంధ్రజ్యోతి కి
23వ వార్షికోత్సవ శుభాకాంక్షలు
ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజానీకానికి,
మిత్రులకు, శ్రేయోభిలాషులకు,
దీపావళి పర్వదిన
శుభాకాంక్షలు
మాధవనేని రఘునందన్ రావు, మెదక్ పార్లమెంట్ సభ్యులు

ఉపాధి పనులలో రూ.70 వేల రికవరీ



ప్రజావేదిక సమావేశంలో అధికారులు

రేగోడు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులలో జరిగిన అక్రమాలపై రూ.70 వేలు రికవరీ చేయడంతో పాటు, రూ.2 వేలు జరిమానాలు విధించినట్లు అడిషనల్ డీఆర్‌డీవో రంగాచారి తెలిపారు. శనివారం రేగోడు మహిళా సమైక్య భవనంలో ఉపాధి హామీ ప్రజావేదిక సమావేశం జరిగింది. గ్రామాల వారీగా జరిగిన పనులపై నివేదికలు అందించారు. ఏప్రిల్ 2024 నుంచి మార్చి 2025 వరకు 18 గ్రామ పంచాయతీలలో రూ.3.12 కోట్ల నిధులతో ఉపాధి పనులు జరిగాయి. ఈ పనులపై జరిపిన తనిఖీల్లో అక్రమాలు జరిగినట్లు తనిఖీ బృందాలు గుర్తించాయి. ఉపాధి సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శులు రూ.70 వేలు రికవరీతో పాటు రూ.3 వేలు జరిమానాలు చెల్లించాలని అధికారులు ఆదేశించారు. ఉపాధి పనులను పకడ్బందీగా నిర్వహించాలని, అవకతవకలకు తావివ్వొద్దని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ మేనేజర్ రాజేందర్ రెడ్డి, సోషల్ ఆడిట్ పీఈ సంపత్ కుమార్ ఆచార్య, ఎస్ఆర్‌పీ నాగరాజు, ఎంపీడీవో సీతారావమ్మ, ఏపీవో జగన్మోహన్ సింగ్, ఈసీ జగదీశ్వర్, టీఏలు శ్రీనివాస్, అశోక్, విజయకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించాలి

● ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

చేగుంట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఎస్టీ వసతి గృహాలు, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు రుచికరమైన భోజనముతో పాటు నాణ్యమైన విద్యను అందించాలని ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య పేర్కొన్నారు. శనివారం చేగుంటలోని తెలంగాణ ఎస్టీ స్పోర్ట్స్ బాలికల గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఏవైనా సమస్యలు ఉంటే ఎవరికి భయపడాల్సిన అవసరం లేదని, తమకు నేరుగా లేదా ఫోన్ ద్వారా సమాచారమిస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం కిచెన్ షెడ్, కూరగాయల స్టోర్ రూమ్, విద్యార్థుల కోసం వండిన భోజనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎస్సీ ఎస్టీ పాఠశాలలు, వసతి గృహాల్లో, గురుకులలో ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు విద్యార్థులకు అందే విధంగా చూడాలన్నారు. మెనూ ప్రకారం భోజనం విద్యార్థులకు అందించే విధంగా జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ఉపాధ్యాయులు, వార్డెన్లకు ఆదేశాలు ఇవ్వాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సుమతి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా, పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట ఏఎస్‌డబ్ల్యూవో లింగేశ్వర్, తహసీల్దార్ శివప్రసాద్, ఎస్సై చైతన్య కుమార్ రెడ్డి, బీసీ హాస్టల్ వార్డెన్ రమేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.



వంటలను పరిశీలిస్తున్న ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

మహిళ మృతదేహం లభ్యం



బాలమణి(ఫైల్)

ములుగు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధి తునికి బొల్లారంలోని అయ్యప్ప చెరువులో మహిళ మృతదేహం లభ్యమైంది. ఎస్సై విజయ్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతురాలు వర్గల్ మండలం మినాజీపేట్‌కి చెందిన మంకని బాలమణి (50)గా గుర్తించారు. మహిళ మృతదేహాన్ని నల్లటి కవర్‌లో కప్పబడి, కాలు మడిమే నరికేసి ఉన్నట్లు గుర్తించినట్లు గజ్వేల్ ఏసీపీ నర్సింహులు తెలిపారు. ఇదివరకే గౌరారం పోలీస్ స్టేషన్‌లో కుటుంబీకుల ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేశామన్నారు. బాలమణి మృతి గల కారణాలు తెలుసుకునేందుకు వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కాల్వలో పడి వ్యక్తి మృతి



మల్లేష్ మృతదేహం

తూప్రాన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): చేపలు పట్టడానికి వెళ్లిన వ్యక్తి కాలువలో పడి మృతి చెందిన సంఘటన చేగుంట మండల కేంద్రంలోని మక్కరాజుపేట బ్రిడ్జి వద్ద చోటు చేసుకుంది. చేగుంట ఎస్ఐ చైతన్య కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నర్సింగ్ మండల కేంద్రానికి చెందిన పోచమ్మల మల్లేశం (45) చేగుంట సమీపంలోని బ్రిడ్జి వద్ద కాలువలో చేపలు పట్టడానికి వచ్చి ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని తూప్రాన్ ఏరియా ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

కత్తులతో దాడి.. ఒకరికి గాయాలు

జహీరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కత్తితో దాడి చేసిన ఘటనలో ఒక వ్యక్తికి గాయాలైన సంఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని ఐడీఎస్ఎంటీ కాలనీలో శనివారం జరిగింది. పట్టణ ఎస్ఐ వినయ్ కుమార్ కథనం ప్రకారం తమిళనాడులోని పరిమళ్ పట్టి ప్రాంతానికి చెందిన పుతురాజు పట్టణంలోని ఐడీఎస్ఎంటీ కాలనీలో చిరుతిండ్లు అమ్ముకుంటూ జీవిస్తున్నాడు. ఇదే ప్రాంతంలో తమిళనాడుకు చెందిన మణికంట కూడా చిరుతిండ్లను అమ్ముకుంటున్నాడు. ఈ క్రమంలో శనివారం పుతురాజు జహీరాబాద్ పట్టణంలో చిరుతిండ్లను అమ్ముకుని ఐడీఎస్ఎంటీ కాలనీకి వెళ్తున్నాడు. అదే సమయంలో మణికంట అడ్డగించి, 'నీవు ఇక్కడ వ్యాపారం చేయొద్దని, నిన్ను చంపితేనే తనకు వ్యాపారంలో ఎలాంటి అడ్డు ఉండదని' అంటూ వెంట తెచ్చుకున్న కత్తితో దాడిచేశాడు. పుతురాజుకు రక్తగాయాలు కాగా, స్థానికులు, కుటుంబీకులు చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుమారుడు నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రేపు వ్రెస్లింగ్ ఎంపికలు

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, జూనియర్ కాలేజీల ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20న ఉమ్మడి జిల్లా వ్రెస్లింగ్ ఎంపికలు నిర్వహించనున్నట్లు సెక్రటరీ గణపతి ఒక ప్రకటనలో తెలిపారు. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌లోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో ఎంపికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఉదయం 10 గంటల వరకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9440686408 నంబరును సంప్రదించాలని కోరారు.

బాలికను మోసం చేసిన యువకుడికి రిమాండ్

రాయపోల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని నమ్మించి బాలికను మోసం చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. రాయపోల్ మండలం ఓ గ్రామానికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ పరిచయం చేసుకొని పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా లోబర్చుకున్నాడు. పెళ్లి చేసుకోమని ఆ అమ్మాయి అడిగితే నిరాకరించడంతో, ఆమె తల్లికి చెప్పింది. వెంటనే రాయపోల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ మానస తెలిపారు.

లోకచంద్ర మృతదేహం లభ్యం

● 18 రోజుల తర్వాత్త
వెండికోలు శివారులో ఆచూకీ



అల్లె లోకచంద్ర (ఫైల్)

పుల్కల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): చౌటకూరు మండలం శివంపేట సమీపంలోని మంజీర నది వంతెనపై నుంచి వరద నీటిలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన అల్లె లోకచంద్ర మృతదేహం లభ్యమైంది. వివరాల్లోకి వెళ్తే.. నియోజకవర్గ కేంద్రమైన జోగిపేట పట్టణానికి చెందిన అల్లె లోకచంద్ర (31) 'క్లింకార' యూట్యూబ్ చానల్‌కు సీఈఓగా పనిచేస్తూనే, మరోవైపు రియల్ ఎస్టేట్ వ్యాపారం, లాడ్జీల నిర్వహణ చేస్తున్నాడు. మండలంలోని వెండికోలు గ్రామానికి చెందిన సిరిపురం లక్ష్మణ్ సెప్టెంబరు 28న లోకచంద్ర నిర్వహిస్తున్న లాడ్జిలో అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఈ సంఘటనపై సంగారెడ్డి రూరల్ పోలీసులు లోకచంద్రను ప్రత్యక్ష సాక్షిగా పేర్కొంటూ కేసు నమోదు చేశారు. ఈ కేసు విషయమై సంగారెడ్డి రూరల్ ఎస్ఐ రవీందర్ డబ్బులు డిమాండ్ చేస్తూ వేధింపులకు గురి చేస్తున్నాడంటూ లోకచంద్ర తన భార్యకు ఆడియో రికార్డును వాట్సాప్ ద్వారా పంపి సెప్టెంబరు 30న మంజీర నది వంతెన పై నుంచి దూకి గల్లంతయ్యాడు. అప్పటి నుంచి గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు.

మత్స్యకారుల సమాచారంతో...

శుక్రవారం ఉదయం నదిలోకి చేపల వేటకు వెళ్లిన మత్స్యకారులకు నది తీర ప్రాంతంలో నడుం భాగం వరకు మట్టిలో కూరుకుపోయి కుళ్లిపోయిన స్థితిలో ఉన్న వ్యక్తి మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న పుల్కల్ ఎస్ఐ విశ్వజన్ అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి, కుటుంబ సభ్యులను రప్పించారు. భార్య ప్రియ, ఇతర కుటుంబ సభ్యులు చేతికి ధరించిన కడియం, గడియారం ఆధారంగా మృతదేహం లోకచంద్రదేనని గుర్తించారు. అక్కడే పోస్టుమార్టం నిర్వహించి జోగిపేటకు తరలించారు.

మృతదేహంతో ఆందోళన

జోగిపేట రూరల్ : తమ కొడుకు ఆత్మహత్యకు కారకులైన వారిని శిక్షించాలంటూ మృతుడి తల్లి ప్రమీల, కుటుంబ సభ్యులతో కలిసి దర్నా సంగారెడ్డి జిల్లా జోగిపేట తహసిల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సముదాయించి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహింపజేశారు.

డబ్బులు వసూలు చేసిన ముగ్గురి అరెస్టు

నర్సాపూర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల క్రితం నర్సాపూర్ సమీపంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఉపాధ్యాయుడిని బెదిరించి, అతడి వద్ద ఉన్న డబ్బులు వసూలు చేసి వదిలేసిన ఘటనలో నిందితులను గుర్తించి ముగ్గురిని అరెస్టు చేసినట్లు డీఎస్పీ నరేందర్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం నర్సాపూర్ సీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. గుమ్మడిదల మండలం అన్నారంకు చెందిన ఉపాధ్యాయుడు కిష్టయ్య ఈ నెల 16వ తేదీన ఆటోలో కొల్చారం నుంచి వస్తుండగా, నర్సాపూర్ సమీపంలో ఆటో డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరు కలిసి బెదిరింపులకు గురిచేసి అతడి వద్ద ఉన్న డబ్బులు వసూలు చేశారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. దర్యాప్తులో నిందితులు సాయికుమార్, అనిల్, కుమార్ లుగా గుర్తించి, వారిని శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరు గతంలో కూడా పలు నేరాలకు పాల్పడిన కేసులు ఉన్నాయని డీఎస్పీ పేర్కొన్నారు. విలేకరుల సమావేశంలో సీఐ జాన్‌రెడ్డి, ఎస్ఐ రంజిత్ కుమార్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ క్రీడలు



విజేతగా నిలిచిన కబడ్డీ బాలురు మెదక్ జట్టు

పటాన్‌చెరు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో అన్ని రకాల క్రీడలకు పటాన్‌చెరును వేదికగా మార్చడమే లక్ష్యంగా విభిన్నమైన పోటీలు నిర్వహించనున్నామని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మైత్రీ మైదానంలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహించిన వాలీబాల్, కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమం శనివారం జరిగింది. అండర్-14 కబడ్డీ బాలికల విభాగంలో మహబూబ్‌నగర్ ప్రథమం స్థానం దక్కించుకోగా, ఖమ్మం ద్వితీయం , నల్గొండ తృతీయం, వరంగల్ జిల్లా నాల్గవ స్థానంలో నిలిచాయి. అండర్-14 కబడ్డీ బాలుర విభాగంలో మెదక్ ప్రథమం, నల్గొండ ద్వితీయం, రంగారెడ్డి తృతీయం, మహబూబ్‌నగర్ జిల్లా నాల్గవ స్థానం దక్కించుకున్నాయి. అండర్-17 వాలీబాల్ బాలుర విభాగంలో ఖమ్మం ప్రథమం, వరంగల్ ద్వితీయం, రంగారెడ్డి తృతీయం, మహబూబ్‌నగర్ జిల్లా నాల్గవ స్థానంలో నిలిచాయి. అనంతరం విజేతలకు ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో వాలీబాల్ జాతీయ క్రీడాకారుడు కృష్ణంరాజు, కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని వీరేష్, జగదీష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

భారీగా రేషన్ బియ్యం పట్టివేత

● అక్బర్‌పేట-భూంపల్లిలో 372 క్వింటాళ్లు, రామచంద్రాపురంలో 12 టన్నులు స్వాధీనం

మిరుదొడ్డి/రామచంద్రాపురం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాలలో భారీగా రేషన్ బియ్యం పట్టుబడ్డాయి. పౌర సరఫరాల అధికారి సాయి రవి, సీఐ గణేష్ తెలిపిన వివరాల ప్రకారం... శుక్రవారం అర్ధరాత్రి సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతె గ్రామంలోని లక్ష్మీప్రసన్న రైస్‌మిల్లును సివిల్ సప్లై, ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అందులోని 372 క్వింటాళ్ల పీడీఎస్ సన్నబియ్యాన్ని రీసైక్లింగ్ చేస్తూ అధిక రేట్లకు మరో రైస్‌మిల్లులకు విక్రయిస్తుండగా వారు పట్టుకున్నారు. ఈ మేరకు రైస్‌మిల్ యజమాని కాపర్తి సంతోష్‌పై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. పట్టుకున్న పీడీఎస్ సన్నబియ్యాన్ని మంజూనాథ రైస్‌మిల్‌లో భద్రపరిచారు. అలాగే, నగరంలోని రాజేంద్రనగర్ నుంచి కర్ణాటకకు డీసీఎంలో అక్రమంగా తరలిస్తున్న 12 టన్నుల రేషన్ బియ్యాన్ని శనివారం ఉదయం సంగారెడ్డి జిల్లా రామచంద్రాపురంలోని ఓఆర్ఆర్‌పై కొల్లూరు పోలీసులు పట్టుకున్నారు. నిందితుడు మహమ్మద్ షమీని అదుపులోకి తీసుకున్నారు. పౌర సరఫరాల అధికారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గీతం విద్యార్థిని లక్ష్మీదేవికి పీహెచ్‌డీ



డాక్టర్ లక్ష్మీదేవి

పటాన్‌చెరు రూరల్, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి): ఫార్మాస్యూటికల్ పరిశోధనను విజయవంతంగా పూర్తిచేసిన హైదరాబాద్‌లోని గీతం స్కూల్ ఆఫ్ ఫార్మసీ పరిశోధక విద్యార్థిని జి. లక్ష్మీదేవిని డాక్టరేట్ వరించింది. రెట్రోవైరల్ వ్యతిరేక మందులు సులువుగా మింగడం కోసం సూత్రీకరణ, అభివృద్ధి, ఘన వ్యాప్తి, తులనాత్మక మూల్యాంకనం, నానోసస్పెన్షన్స్ సెల్ఫ్ నానోఎమల్సిఫైయింగ్ డెలివరీ సిస్టమ్స్‌పై ఆమె అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు ఫార్మసీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పాతూరి రఘువీర్ మార్గదర్శనం చేశారు గీతం విశ్వవిద్యాలయం, హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డి.ఎస్. రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, పలు విభాగాల అధిపతులు, సిబ్బంది లక్ష్మీదేవిని అభినందించారు.

స్వీపర్.. వైద్యురాలిగా మారి

● గాయంతో సిర్గాపూర్ పీహెచ్‌సీకి వచ్చిన వ్యక్తి
● వైద్యులు లేకపోవడంతో చికిత్స చేసిన స్వీపర్

కల్హేర్/సిర్గాపూర్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి) : సిర్గాపూర్ పీహెచ్‌సీలో 24 గంటలూ వైద్య సిబ్బంది ఉండాల్సి ఉన్నా ఏ ఒక్కరూ అందుబాటులో ఉండడంలేదు. దీంతో స్వీపర్ వైద్యం చేయాల్సిన దుస్థితి నెలకొన్నది. వివరాల్లోకి వెళ్లితే సిర్గాపూర్‌కు చెందిన దేవకతే పండరి(60) పొలం వద్ద ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై గాయంతో పండరి శనివారం సాయంత్రం స్థానిక పీహెచ్‌సీకి చికిత్స నిమిత్తం వచ్చాడు. వైద్య సిబ్బంది లేకపోవడంతో ఆసుపత్రిలో స్వీపర్‌గా పనిచేసే మహిళ గాయాలకు మందు వేసి కట్టు కట్టింది. గతంలోనూ సిర్గాపూర్ పీహెచ్‌సీలో ఇలాంటివి చాలా చోటుచేసుకున్నాయి. అయినా ఉన్నతాధికారులు ఇక్కడి వైద్యులు, సిబ్బందిపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. అత్యంత అత్యవసర సేవల విభాగంలో ఒక్కరూ కూడా విధినిర్వహణలో లేకపోవడమేమిటని సిర్గాపూర్ మాజీ ఎంపీటీసీ పీరప్ప, గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం గాయపడిన పండరిని నారాయణఖేడ్ ఆసుపత్రికి తరలించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఎంహెచ్‌వో అయినా దీనిపై దృష్టి సారించాలని స్థానికులు డిమాండ్ చేశారు.



విద్యుదాఘాతానికి గురైన వ్యక్తికి వైద్యం చేస్తున్న స్వీపర్

కోడలు పట్టించుకోవడంలేదు..

● కొడుకు ఆస్తులను మార్చేసుకుంది
● భోజనానికి, మందులకు ఇబ్బందులు
● తూప్రాన్ ఆర్డీవోను ఆశ్రయించిన వృద్ధ రైతు



తూప్రాన్ ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న చంద్రారెడ్డి

తూప్రాన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): 'వ్యవసాయ భూములమ్మి ఆస్తులు కొన్నాం. అవన్నీ కొడుకు పేరిట ఉండటంతో ఆస్తులను కోడలు తన పేరిట మార్చుకుంది. అనారోగ్యం బారిన పడిన భర్తను పట్టించుకోలేదు. చనిపోతే దహన సంస్కారాలకు హాజరు కాకపోగా, వైద్యం చేయించిన సోదరికే ఎగనామం పెట్టింది. మామకు కనీసం ఆసుపత్రి ఖర్చులు ఇవ్వకపోగా, భోజనం కూడా పెట్టడంలేదు. అధికారులు స్పందించి ఆస్తులను తన పేరా మార్పిడి చేయాలి' అంటూ ఓ 75 ఏళ్ల వృద్ధ రైతు ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ మండలం యావాపూర్‌లో చోటు చేసుకుంది. బాధితులు, గ్రామస్థుల కథనం ప్రకారం.. యావాపూర్‌కు చెందిన శేరి చంద్రారెడ్డి (75)కి ఇద్దరు కుమార్తె లు, కుమారుడు మహిపాల్‌రెడ్డి ఉన్నారు. కొడుకు పోతరాజుపల్లి వద్ద చికెన్ సెంటర్ నిర్వహిస్తూ భార్య కవితతో అక్కడే ఉన్నాడు. గ్రామంలో ఉన్న వ్యవసాయ భూములు అమ్మి, మహిపాల్‌రెడ్డి పేరుతో గజ్వేల్ మండలం పిడిచెడ్‌లో వ్యవసాయ భూమి, యాదగిరిగుట్ట, తూప్రాన్‌లలో ప్లాట్లు కొనుగోలు చేశారు. మహిపాల్‌రెడ్డి, కవిత దంపతుల మధ్య గొడవలు జరగడంతో కొద్దిరోజులు వేరుగా ఉండగా, గ్రామస్థులు, పెద్దలు రాజీ చేయడంతో కలిసిపోయారు. ఆ సమయంలో కొడుకుపై ఉన్న ఆస్తులను కోడలు కవిత తన పేరిట మార్చుకున్నారు. మహిపాల్‌రెడ్డి అనారోగ్యానికి గురికాగా, కోడలు విడిచి వెళ్లిపోయింది. దీంతో మహిపాల్‌రెడ్డి స్వగ్రామానికి వచ్చేయగా, వైద్యానికి కుమార్తె సహాయం చేసింది. మే 1న అతను చనిపోగా కోడలు దహన సంస్కారాలకు కూడా రాలేదు. తనకు ఆరోగ్యం బాగాలేకపోతే కూతురు వైద్యం చేయించినట్లు చంద్రారెడ్డి తెలిపారు. కొడుకుపై ఉన్న ఆస్తులను కోడలు మార్చుకొని, 75ఏళ్ల తన బాగోగులు పట్టించుకోవడంలేదని, వైద్యానికి సహాయం చేయడంలేదని చంద్రారెడ్డి వాపోయారు. కొడుకు వైద్యం కోసం చేసిన ఖర్చుల కోసం ఇంటిని అమ్మితే, కోడలు వచ్చి కబ్జా చేసినట్లు గ్రామస్థులు, చంద్రారెడ్డి తెలిపారు. తనకు భోజనానికి ఇబ్బంది అవుతుందని చంద్రారెడ్డి పేర్కొంటూ, కోడలు పేర ఉన్న తన ఆస్తులను మార్చి, తనకు న్యాయం చేయాలన్ని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డికి చేసిన వినతిలో కోరారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి
మెదక్
జిల్లాల వార్తలు
ఆదివారం 19 అక్టోబరు 2025



టాస్క్‌ఫోర్స్ తనిఖీలు.. 2 స్కానింగ్ మిషన్లు సీజ్

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలోని పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ తనిఖీలు ముగిశాయి. రెండ్రోజుల్లో ఐదు ప్రైవేటు ఆస్పత్రులను తనిఖీ చేసినట్లు డీఎంహెచ్‌వో నాగనిర్మల తెలిపారు. స్కానింగ్ రికార్డులు ఆన్‌లైన్‌లో పొందుపర్చని రెండు ప్రైవేటు ఆస్పత్రుల్లోని స్కానింగ్ మిషన్లను సీజ్ చేసినట్లు వివరించారు. జిల్లా కమిటీ నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకులు నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.







డీసీసీ అధ్యక్షులకు ప్రాధాన్యం

ఏఐసీసీ పరిశీలకురాలు జ్యోతి రౌటేలా


జోగిపేటలో మాట్లాడుతున్న జ్యోతి రౌటేలా

జోగిపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): డీసీసీ అధ్యక్షులకు పార్టీలో ప్రాధాన్యం పెరగనుందని, వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థుల ఎన్నికలో వారి నిర్ణయం కీలకమవుతుందని ఏఐసీసీ పరిశీలకురాలు జ్యోతి రౌటేలా ఏర్కొన్నారు. మెదక్ డీసీసీ అధ్యక్షుడి ఎంపిక కోసం జోగిపేటలో కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన అభిప్రాయ సేకరణ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇకపై పార్టీ నిర్ణయాల్లో డీసీసీ అధ్యక్షుల అభిప్రాయాలే కీలకంగా మారనున్నాయని, అందుకే కార్యకర్తల అభిప్రాయాలను సేకరిస్తున్నామని తెలిపారు. నిరంతరం ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండేవారికే డీసీసీ అధ్యక్ష పదవికి ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్మోహన్‌రెడ్డి, మెదక్ జిల్లా నాయకులు ఆవుల రాజిరెడ్డి, అంజనేయులు, పార్టీ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు రమేశ్ లింగాయత్, శేషారెడ్డి, దిగంబర్‌రావు, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, మాన్‌కిషన్, సంగమేశ్వర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్


పత్తి పంటను పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

టేక్మాల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రైతులు పత్తిని సీసీఐ కేంద్రాల్లోనే విక్రయించాలని, దళారులను నమ్మి మోసపోవద్దని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మండల పరిధిలోని బర్ధీపూర్ గ్రామంలోని పత్తి పంటను శనివారం ఆయన పరిశీలించారు. జిల్లాలో మొత్తం 25,939 మంది రైతులు 34,903 ఎకరాల్లో పత్తి పంటను సాగుచేస్తున్నారని తెలిపారు. జిల్లాలో పాపన్నపేటలోని జిన్నింగ్‌మిల్లులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని, అక్కడ విక్రయించి రైతులు మద్దతు ధరను పొందాలని కోరారు.







బీసీ రిజర్వేషన్లకు కాంగ్రెస్ కట్టుబడి ఉంది

- బీసీల అభ్యున్నతే రాహుల్, రేవంత్‌రెడ్డి ప్రధాన లక్ష్యం
- బంద్‌లో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ బీసీ జేఏసీ పిలుపు మేరకు సంగారెడ్డిలో నిర్వహించిన బంద్‌కు కాంగ్రెస్ మద్దతుగా నిలిచింది. ఈమేరకు సంగారెడ్డిలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించాయి. అనంతరం కొత్త బస్టాండ్ సమీపంలో దర్నా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి ఉద్దేశమన్నారు. సామాజికంగా ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడిన బీసీ కులాలు అభివృద్ధిలోకి రావాలంటే బీసీ రిజర్వేషన్లు ఒక్కటే మార్గమని అన్నారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ చిత్తశుద్ధితో ఉందన్నారు. అందువల్లే బీసీ రిజర్వేషన్లపై బిల్లు పెట్టి అసెంబ్లీలో ఆర్డినెన్స్ తీసుకువచ్చారని పేర్కొన్నారు. సోనియాగాంధీ తెలంగాణ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ రాష్ట్రాన్ని ఏవిధంగా ఏర్పాటు చేశారో.. అలాగే పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్ల బిల్లు పెట్టి ప్రధానమంత్రి నరేంద్రమోదీ బీసీల పట్ల తన చిత్తశుద్ధిని చాటుకోవాలని టజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంతకిషన్, కాంగ్రెస్ నాయకులు జూలకంటి అంజనేయులు, కూన సంతోష్, ప్రభుగౌడ్, కిరణ్‌గౌడ్, రామ్‌రెడ్డి, మహేష్, జార్జి తదితరులు పాల్గొన్నారు.


బంద్‌లో మాట్లాడుతున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి


సంగారెడ్డిలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు


మెదక్ ఎక్సైజ్ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణ కోసం ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్ వద్ద దరఖాస్తుదారులు

ఆబ్కారీ శాఖకు కిక్కు

మద్యం దుకాణాల దరఖాస్తు రుసుం పెంచినా వెనక్కితగ్గని వ్యాపారులు

- సంగారెడ్డి జిల్లాలో 4,067..
- మెదక్ జిల్లాలో 1,369 దరఖాస్తులు
- ఎక్సైజ్ శాఖకు రూ. 163 కోట్ల ఆదాయం
- దరఖాస్తుదారుల్లో పెరిగిన మహిళల సంఖ్య
- ఈ నెల 23న లాటరీ విధానంలో కేటాయింపు

మెదక్/మెదక్ అర్బన్/సంగారెడ్డి క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాల దరఖాస్తులతో ఎక్సైజ్ శాఖకు కొత్త కిక్ వచ్చింది. మెదక్ జిల్లాలో మూడు సర్కిళ్ల పరిధిలోని 49 దుకాణాలకు 1,369 టెండర్లు దాఖలయ్యాయి. శనివారం చివరి రోజు కావడంతో జిల్లాలో 569 అప్లికేషన్లు వచ్చాయి. దరఖాస్తు రుసుం ద్వారా ఆబ్కారీశాఖకు రూ. 41.07 కోట్ల ఆదాయం సమకూరింది. మెదక్ సర్కిల్‌లో 17 షాపులకు 498, నర్సాపూర్ సర్కిల్‌లో 17 దుకాణాలకు 502, రామాయంపేట సర్కిల్‌లో 15 వైన్స్‌లకు 369 టెండర్లు దఖలయ్యాయి. అత్యధికంగా పోతంశెట్టిపల్లిలోని ఏడుపాయల కమాన్ వద్ద

మిగతా 10వ పేజీలో

బంద్ సక్సెస్

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం శనివారం చేపట్టిన బంద్ సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ప్రశాంతంగా ముగిసింది. బీసీ సంఘాలతో పాటు అన్ని పార్టీలు, ప్రజా సంఘాలు మద్దతివ్వడంతో బంద్ సక్సెస్ అయ్యింది. పట్టణాలు, మండల కేంద్రాల్లో దుకాణాలు, వ్యాపార సంస్థలు మూతపడ్డాయి. ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. రహదారులు, ప్రజా రవాణా స్తంభించడంతో రాకపోకలు నిలిచిపోయాయి.


బంద్‌తో నిర్మానుష్యంగా మారిన మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రధాన వ్యాపార కేంద్రమైన జేఎన్‌రోడ్డు

- బీసీ సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకోలు
- మద్దతు పలికిన పార్టీలు, ప్రజా సంఘాలు
- తెరుచుకోని దుకాణాలు
- డిపోలకు పరిమితమైన ఆర్టీసీ బస్సులు

మెదక్/మెదక్ అర్బన్/సంగారెడ్డి టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో బీసీ సంఘాల ఆధ్వర్యంలో శనివారం తలపెట్టిన బంద్‌కు అధికార కాంగ్రెస్‌తో పాటు బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం తదితర పార్టీలు, ప్రజా సంఘాలు, కుల సంఘాలు మద్దతు తెలుపుతూ ప్రత్యక్షంగా పాల్గొన్నాయి. వ్యాపార సంస్థలు, ప్రభుత్వ, ప్రవేటు విద్యాలయాలు, పెట్రోల్ బంకులు, హోటళ్ల అన్నిరకాల వ్యాపారులు స్వచ్ఛందంగా మూసివేశారు. మెదక్ బస్‌డిపో ఎదుట తెల్లవారుజామునే ఆందోళనకారులు బైఠాయించడంతో బస్సులు నిలిచిపోయాయి. ప్రజా రవాణా స్తంభించింది. రామాయంపేటలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు బంద్‌లో పాల్గొన్నారు. కౌడిపల్లి మండల కేంద్రంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో 765 జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. నర్సాపూర్‌లో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. శివంపేట మండలంలో బీఆర్ఎస్ నాయకులు హైవేపై రాస్తారోకో నిర్వహించారు. మాసాయిపేటలో అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టడంతో హైవే 44పై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. మెదక్‌లో రాజకీయ పార్టీల నేతలు, బీసీ సంఘాలు నాయకులు, ఉద్యోగ సంఘాల నేతలు శ్రీకాంత్, సురేందర్‌గౌడ్, బట్టి జగపతి, మల్లికార్జున్‌గౌడ్, మోహన్‌గౌడ్, అక్కెశ్రీను, మల్లేశం, శంకర్‌గౌడ్, రమేష్, కృష్ణగౌడ్, కిషోర్, నర్సింహులు, కృష్ణ, మల్లేషం, అనిల్‌కుమార్, బాల్‌రాజ్, కాశీనాథ్, ప్రసాద్, దయాసాగర్, సుధాకర్, రామస్వామి, స్వరూప, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లాలో బంద్ ప్రశాంతంగా ముగిసింది. సంగారెడ్డి, పటాన్‌చెరు, జహీరాబాద్, నారాయణఖేడ్, అందోల్, నియోజకవర్గ కేంద్రాలతో పాటు మండలాల్లో రాస్తారోకోలు, దర్నాలు చేపట్టారు. సంగారెడ్డి పరిధి పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్ద 65వ నంబరు జాతీయ రహదారిపై ప్రజా సంఘాలు రాస్తారోకో నిర్వహించడంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. సంగారెడ్డి, నారాయణఖేడ్, జహీరాబాద్ డిపోల్లో బస్సులు నిలిచిపోయాయి. సాయంత్రం లోకల్ సర్వీసులను కొనసాగించారు. అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.


సంగారెడ్డిలో పోతిరెడ్డిపల్లి చౌరస్తా వద్ద జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న వివిధ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు





జహీరాబాద్ : బీసీ బంద్ సందర్భంగా డిపోకే పరిమితమైన జహీరాబాద్ బస్సులు



నర్సాపూర్‌లో ధర్నా నిర్వహిస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, నాయకులు



మెదక్ అర్బన్ : బీసీ బంద్ సందర్భంగా డిపో ఎదుట బీసీ సంఘాలు, వివిధ పార్టీల నాయకుల నినాదాలు

బీసీ బంద్ ప్రశాంతం

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలంటూ బీసీ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు చేపట్టిన బంద్ శనివారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో ప్రశాంతంగా ముగిసింది. బంద్ నేపథ్యంలో జిల్లాల్లో ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. ప్రజా, బీసీ సంఘాలతో పాటు కాంగ్రెస్, బీఆర్ఎస్ తదితర పార్టీలు మద్దతు పలికాయి. జాతీయ రహదారిపై పెద్దఎత్తున రాస్తారోకోలు నిర్వహించారు. దీంతో రాకపోకలు స్తంభించాయి.

- న్యూస్ నెట్‌వర్క్



చేగుంట మండల కేంద్రంలో చేపట్టిన బీసీ బంద్‌లో వివిధ పార్టీల నాయకులు



జిన్నారంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



సంగారెడ్డిలో ప్రధాని నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు



మునిపల్లి మండలంలోని ముంబయి జాతీయ రహదారి బుదేరా చౌరస్తాలో బీఆర్ఎస్, టీఆర్‌పీ, సీపీఎం నాయకుల నిరసన



బీసీ బంద్‌కు మద్దతుగా వెల్దుర్తిలో ధర్నా నిర్వహించిన బీఆర్ఎస్ నాయకులు



చౌటకూర్ మండలం శివంపేటలో 161 జాతీయ రహదారిపై ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



పటాన్‌చెరు : ఇస్నాపూర్‌లో భారీ స్థాయిలో రాస్తారోకో నిర్వహిస్తున్న నాయకులు



బీసీ బంద్ సందర్భంగా తూప్రాన్‌లో అఖిలపక్షం నాయకుల ఆందోళన



పెద్దశంకరంపేటలో నిరసన వ్యక్తం చేస్తున్న బీసీ సంఘాల జేఏసీ నాయకులు

కుమారుడికి పెళ్లి రావాలి

● సీఎంను ఆహ్వానించిన ఎమ్మెల్సీ



సీఎం రేవంత్‌రెడ్డికి శుభలేఖ అందజేసిన ఎమ్మెల్సీ అంజిరెడ్డి

రామచంద్రాపురం టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 24న జరగనున్న కుమారుడు అనిష్‌రెడ్డి వివాహానికి రావాలంటూ సీఎం రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్సీ అంజిరెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి ఆహ్వానించారు. అలానే గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను కలిసి పెళ్లికి రావాలంటూ అంజిరెడ్డి దంపతులు ఆహ్వానపత్రిక అందజేశారు.

విద్యుత్ సమస్యలపై 'ప్రజాబాట'

నిజాంపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రజాబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని విద్యుత్‌శాఖ ఏఈ గణేష్‌కుమార్ తెలిపారు. నిజాంపేట మండల కేంద్రంలో శనివారం ప్రతి ఇంటికి వెళ్లి విద్యుత్ సమస్యలను అడిగి తెలుసుకుని మాట్లాడారు. గ్రామాల్లో నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తామన్నారు. వినియోగదారులకు అందుబాటులో ఉంటూ లూజ్ లైన్‌లో వోల్టేజ్, ఇతరత్రా విద్యుత్ సమస్య లేకుండా చూస్తామని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యుత్ అధికారులు, వినియోగదారులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేపట్టొద్దు

చిన్నశంకరంపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : రైతులు విద్యుత్ మరమ్మతులు చేపట్టొద్దని లైన్‌మెన్ భిక్షపతి సూచించారు. శనివారం చిన్నశంకరంపేట మండల పరిధిలోని సూరారం గ్రామంలో రైతులకు విద్యుత్ మరమ్మతులపై అవగాహన కల్పించి మాట్లాడారు. ట్రాన్స్‌ఫార్మర్లు చెడిపోయినా.. వైర్లు తెగినా మరమ్మతులు చేపట్టొద్దన్నారు. విద్యుత్ సిబ్బందికి సమాచారం అందిస్తే వచ్చి మరమ్మతులు చేస్తారని తెలిపారు.

వివాహిత అదృశ్యం

నర్సాపూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : వివాహిత అదృశ్యమైన సంఘటన నర్సాపూర్ మండలం నాగులపల్లి గ్రామంలో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన రెడ్డిపల్లి ప్రశాంత్‌కు రెండేళ్ల క్రితం జిన్నారం మండలం రాళ్లకత్వకు చెందిన లతతో వివాహమైంది. కొన్నిరోజుల నుంచి వేరే కాపురం పెడదామని లత భర్తతో తరచూ గొడవ పడుతుంది. అందులో భాగంగా శుక్రవారం నర్సాపూర్‌కు వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదు. భర్త చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ రంజిత్‌కుమార్ రెడ్డి తెలిపారు.

చేగుంటలో మహిళ..

తూప్రాన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): మహిళా అదృశ్యమైన సంఘటన చేగుంట మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. చేగుంట గ్రామానికి చెందిన దుద్యాల కల్యాణి ఈ నెల 17న బంధువుల ఇంటికి వెళ్తున్నానని చెప్పి వెళ్లింది. కల్యాణి ఫోన్ కలవకపోవడంతో కుటుంబీకులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం భర్త సురేష్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

సొంతింటి కల సాకారం చేయడమే లక్ష్యం : ఎమ్మెల్యే



నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు

నిజాంపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల లక్ష్యమని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు పేర్కొన్నారు. మండల పరిధిలోని నస్కల్, నందగోకుల్, కల్వకుంట తిప్పనగుళ్ల గ్రామాల్లో శనివారం పర్యటించి నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించి మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏ ఒక్క పేదోడికి ఇళ్లు మంజూరు చేయలేదని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఇచ్చిందన్నారు. అలాగే రైతులు దళారులను నమ్మి మోసపోకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అమర్ సేనారెడ్డి, వెంకటేష్‌గౌడ్, కొమ్మట బాబు, నసీరోద్దీన్, సత్యనారాయణ పాల్గొన్నారు.

పత్తి విక్రయాల కోసం స్లాట్ బుక్ చేసుకోవాలి

అల్లాదుర్గం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పత్తి విక్రయాల కోసం రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దని, సీసీఐలో మాత్రమే విక్రయించాలని అల్లాదుర్గం వ్యవసాయ శాఖ మండల అధికారి రాజేశ్‌కుమార్ తెలిపారు. శనివారం మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో రైతులకు పత్తి విక్రయాలపై అవగాహన కల్పించారు. ఆరుగాలం శ్రమించి పండించిన పత్తిని విక్రయించేందుకు రైతులు ఇబ్బందులు పడకుండా సీసీఐ కేంద్రాల్లో ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు విక్రయించాలన్నారు. ఈ విక్రయాల కోసం కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకోవాలని రైతుకు వివరించారు. బుక్ అయిన తర్వాత సూచించిన తేదిన పత్తిని తీసుకెళ్లాలని సూచించారు. ఏఈవో నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ స్వాధీనం

శివ్వంపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : అటవీ ప్రాంతంలో నిల్వ ఉంచిన ఇసుకను టిప్పర్‌లో అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. మండల పరిధి పాంబండ శివారులోని దర్యాలమ్మకుంట అటవీ ప్రాంతంలో ఇసుక తవ్వకాలు నిర్వహిస్తూ.. గ్రామ శివారులో నిల్వచేసి శనివారం రాత్రి టిప్పర్‌లో తరలిస్తుండగా నమ్మదగిన వ్యక్తులు ఇచ్చిన సమాచారంతో పాంబండ సబ్‌స్టేషన్ సమీపంలో ఇసుక టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

32 మందికి ఉచిత కంటి శస్త్ర చికిత్సలు

నారాయణఖేడ్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : శ్రీ సత్యసాయి సేవాసమతి ఆధ్వర్యంలో 32 మందికి ఉచిత కంటి పొరల శస్త్ర చికిత్సలు నిర్వహించారు. ఖేడ్‌లోని శ్రీసత్యసాయి సేవా నిలయంలో 16న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరానికి 53 మంది హాజరు కాగా వారిలో 36 మందికి కంటి పొరల శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. 32 మంది శస్త్రచికిత్సలకు సమ్మతి తెలుపగా... వారిని ఉచిత రవాణా సదుపాయం కల్పించి హైదరాబాద్ నానక్‌రాంగూడలోని శంకర కంటి వైద్యశాలకు తీసుకెళ్లి శస్త్ర కిచిత్సతలు చేయించి శనివారం ఖేడ్‌కు తీసుకొచ్చారు.

దొంగ వస్తువులు కొంటే చర్యలు

జహీరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ ప్రాంతంలోని స్ర్కాప్ దుకాణాల నిర్వాహకులు దొంగ వస్తువులను కొంటే కఠిన చర్యలు తీసుకుంటామని జహీరాబాద్ పట్టణ సీఐ శివలింగం హెచ్చరించారు. ఆయన ఎస్‌ఐ వినయ్‌కుమార్‌తో కలిసి పోలీస్‌స్టేషన్ స్ర్కాప్ దుకాణాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎవరైనా స్ర్కాప్‌ను, వివిధరకాల వాహనాలను తీసుకొస్తే పూర్తి సమాచారం తీసుకుని కొనుగోలు చేయాలన్నారు.

మహిళా సాధికారతతోనే అభివృద్ధి

● జిల్లా మహిళా సంక్షేమశాఖ అధికారి హేమభార్గవి



హన్మంతాపూర్‌లో న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న హేమభార్గవి

నర్సాపూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : మహిళా సాధికారతతోనే అభివృద్ధి సాధ్యమని మెదక్ జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ అధికారి హేమబార్గవి పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో పేదరిక నిర్మూలన దినోత్సవం సందర్భంగా పట్టణ పరిధిలోని హన్మంతాపూర్‌లో డ్వాక్రా మహిళలకు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలందరూ ఆర్థిక, సామాజిక పరిస్థితులను మెరుగు పరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ కౌన్సిల్ ప్రతినిధి స్వరూప, ఉమన్ అండ్ చైల్డ్ కో ఆర్డినేటర్ సంతోష, పారామెడికల్ సఖి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మరమ్మతులకు అంచనాలు వేయండి

● మెదక్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ

తూప్రాన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కోర్టు ఏర్పాటుకు భవన మరమ్మతులను అంచనాలు వేసి సమర్పించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ అధికారులను ఆదేశించారు. తూప్రాన్ పట్టణానికి జూనియర్ సివిల్ జడ్జి కమ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ద ఫస్ట్ క్లాస్ కోర్టు మంజూరైంది. కోర్టు ఏర్పాటుకు పాత మండల ప్రజాపరిషత్ కార్యాలయ భవనం అప్పగించగా శనివారం కోర్టు సిబ్బంది, న్యాయవాదులు, రోడ్లు భవనాలశాఖ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. భవనం పూర్తిగా పరిశీలించి కోర్టుకు అవసరమైన గదుల ఏర్పాటుకు సూచనలు చేశారు. దెబ్బతిన్న డోర్లు, కిటికీలు మరమ్మతులు చేసేందుకు ఎస్టిమేట్ తయారు చేయాలని డీఈ వేణును ఆదేశించారు. ఆమె వెంట తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, డీఎస్పీ నరేందర్‌గౌడ్, సీఐ రంగకృష్ణ, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ శివానందం, ఎంపీడీవో సతీష్, న్యాయవాదులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో భూపాల్‌రెడ్డి ప్రచారం

నారాయణఖేడ్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి జరుగుతున్న ఉప ఎన్నికలో భాగంగా ఎర్రగడ్డ డివిజన్ పరిధిలోని బంజారా కాలనీకి నారాయణఖేడ్ మాజీ ఎమ్మెలే భూపాల్‌రెడ్డిని బీఆర్ఎస్ ఇన్‌చార్జిగా నియమించింది. ఈ మేరకు శనివారం ఆయన శనివారం కాలనీలో ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వ బాకీకార్డు పేరిట ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేస్తూ బీఆర్ఎస్ అభ్యర్థి సునీతను గెలిపించాలని కోరారు. ఆయన వెంట ఖేడ్ మాజీ జడ్పీటీసీ రవీందర్‌నాయక్, బీఆర్ఎస్ ఖేడ్ మండల అధ్యక్షుడు పరమేశ్వర్, బీఆర్ఎస్వీ ఖేడ్ నియోజకవర్గ అధ్యక్షుడు అంజాగౌడ్, మాజీ సర్పంచులు చెన్‌బసప్ప, వెంకటేశం, రాజు నాయక్, తదితరులు ఉన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి : ఆర్డీవో

కొండాపూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : భూ భారతి సమస్యలను రికార్డులు పరిశీలించి పరిష్కరించాలని సంగారెడ్డి ఆర్డీవో రాజేందర్ అధికారులకు సూచించారు. శనివారం కొండాపూర్ రెవెన్యూ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసి, పలు రికార్డులను పరిశీలించారు. కొండాపూర్ మండలం రెవెన్యూ గ్రామాలను ప్రాజెక్ట్ ఎంపికలో భూ సమస్యల పరిష్కారాలపై ఆర్డీవో ఆరాతీశారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించడంలో అధికారులు చూపిన చొరవను అభినందించారు. ఆయన వెంట తహసీల్దార్ అశోక్, ఆర్ఐ రాజు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఆబ్కారీ శాఖకు కిక్కు

(9వ పేజీ తరువాయి)

ఉన్న షాప్ నం 15 కోసం 52 దరఖాస్తులు వచ్చాయి. ఈ నెల 23న మెదక్‌లోని వెంకటేశ్వర గార్డెన్‌లో కలెక్టర్ సమక్షంలో లక్కీలాటరీ ద్వారా దుకాణాలను కేటాయించనున్నారు. ఈసారి దరఖాస్తు ఫీజును పెంచడంతో గతం కంటే తక్కువ దరఖాస్తులు వచ్చినా ఆదాయం మాత్రం భారీగా పెరిగింది. మద్యం దుకాణాల కోసం రియల్‌ఎస్టేట్, ఫైనాన్స్ వ్యాపారులు, ఇతర రాష్ట్రాలవారు కూడా దరఖాస్తులు సమర్పించారు. దరఖాస్తుదారుల్లో 339 మంది మహిళలు ఉన్నారు. రెండేళ్ల క్రితం మెదక్ జిల్లాలో 1,905 దరఖాస్తులు రాగా, రూ.38.10 కోట్ల ఆదాయం సమకూరింది.

సంగారెడ్డి జిల్లాలో రూ. 122 కోట్ల ఆదాయం

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లాలో 101 మద్యం దుకాణాలకు 4067 దరఖాస్తులు వచ్చాయి. అప్లికేషన్ ఫీజు రూపంలో సర్కారుకు రూ. 122 కోట్ల ఆదాయం సమకూరింది. జిల్లాలో గత నెల 26 నుంచి... శుక్రవారం వరకు 2,270 దరఖాస్తులు రాగా.. శనివారం ఒక్కరోజే రికార్డు స్థాయిలో 1,787 దరఖాస్తులు రావడం గమనార్హం.